క్లుప్తంగా

నేడు శోభన్‌బాబు జయంతి

గన్‌ఫౌండ్రీ: ఈనెల 28న శోభన్‌బాబు సేవా సమితి తెలంగాణ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో అందాల నటుడు శోభన్‌బాబు 87వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సినీనటుడు రాజశేఖర్, జీవిత దంపతులకు పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యులు మధుసుధనాచారి, దర్శకుడు రేలంగి నర్సింహారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

'క్రీడలను ప్రోత్సహిస్తున్నాం'



కబడ్డీ విజేతలకు కప్పును అందజేసిన ప్రిన్సిపాల్ నాగేశ్వర్

జియాగూడ: శ్లోకా స్కూల్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారమ్, రన్నింగ్, సింగింగ్, డ్రాయింగ్, ఎస్సే వ్రైటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రతినిధులు అమిత చరణ్, మాలతి, సుఖ్‌పాల్ సింగ్, నిఖిల్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ప్రశంసా పత్రాలతో ఉద్యోగులను అభినందిస్తున్న జోనల్ కమిషనర్

చాంద్రాయణగుట్ట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జీహెచ్‌ఎంసీ ఉద్యోగులను జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ అవార్డు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. 2022–23 సంవత్సరంలో బెస్ట్ కలెక్షన్ చేసిన ఏఎంసీ మోహన్‌రెడ్డి, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయల్, బిల్లు కలెక్టర్ గౌస్ మోహినుద్దీన్‌లకు ఆయన అవార్డులతో పాటు ప్రశంస పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

అభినందన



నందకృష్ణను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ–టెక్నో పాఠశాల 10వ తరగతి విద్యార్థి జాతీయ కుస్తీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించారు. ఈనెల 21న మహారాష్ట్రలో 'ఆల్ ఇండియా ట్రెడిషనల్ రెజ్లింగ్ అండ్ పాన్‌క్రాషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 10వ మాస్ రెజ్లింగ్ నేషనల్ చాంపియన్‌షిప్ 2023లో ఎస్.నందకృష్ణ, ప్రతిభకనబరిచి బంగారు పతకం, పాన్ క్రాషను కాంపిటీషన్‌లో వెండి పతకాన్ని సాధించాడు. ఈ మేరకు పాఠశాలలో నందకృష్ణను అభినందించారు. నారాయణ విద్యా సంస్థల జీఎం.గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ నవీన్, ప్రిన్సిపాల్ నిర్మల పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



జియాగూడ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోటీల్లో గెలుపొందిన చిన్నారి క్రీడాకారులకు బహుమతులు అందజేయడం హర్షణీయమని కృష్ణవేణి స్కూల్స్ వైస్ చైర్మన్ ఐబీటీ శ్రీనివాస్, అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.

భార్యను హింసించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: ఆస్తి అమ్మకానికి అడ్డొస్తుందంటూ భార్యను చిత్ర హింసలకు గురిచేసిన వ్యక్తికి నాంపల్లి న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. వట్టెపల్లికి చెందిన తాహెర్ బేగం, మహ్మద్ రషీద్(61) భార్యాభర్తలు. ఇంటి అమ్మకానికి సంబంధించి సంతకం పెట్టడం లేదని 2015 జూలై 1న భార్యను తీవ్రంగా కొట్టి చేతికి గాయం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ ఫైల్ చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి సుబవల్లీ నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరిచారు.

అలరిస్తున్న ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లోని మినీ ట్రైన్‌లో పిల్లల సందడి

అబిడ్స్: ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా అలరిస్తుంది. 82వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్) జనవరి 1న ప్రారంభమై ఫిబ్రవరి 15న ముగియనుంది. 28 రోజుల్లో ఎగ్జిబిషన్‌ను 10 లక్షలకు పైగా సందర్శకులు సందర్శించారు. పిల్లలతో పాటు పెద్దలు కూడా ఎగ్జిబిషన్‌లో సందడి చేస్తున్నారు.

మొదటిసారిగా..

ఎగ్జిబిషన్‌లో మొదటిసారిగా బుద్ధిమాంద్యం పిల్లలు అలరించే విధంగా ఎగ్జిబిషన్ సొసైటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ దఫా ఎగ్జిబిషన్‌లో బుద్ధిమాంద్యం పిల్లలకు ఉచితంగా ట్రైన్ ఎక్కించి అమ్యూజ్‌మెంట్ విభాగాలలో వారిని అలరింపజేశారు. సొసైటీ ప్రతినిధులు పిల్లల కోసం ప్రత్యేకంగా సందడి చేసే ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న ఎన్‌సీసీ విద్యార్థుల ప్రదర్శన



ఎన్‌సీసీ విద్యార్థుల ప్రదర్శన

చార్మినార్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఇబ్రాహీం ఖలీలుల్లా మసీదు పక్కనున్న ప్లే గ్రౌండ్‌లో రాయల్ ఇండియన్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థుల ప్రదర్శన జరిగింది. రాయల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ మహమ్మద్ మహబూబ్ షరీఫ్ నిజామీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్‌సీసీ క్యాడెట్ ప్రదర్శనలో సికింద్రాబాద్ 5 టీ బెటాలియన్ సబ్ మేజర్ ఎస్ఎస్‌కే సింగ, డాక్టర్ మౌలానా మహ్మద్ సమీఉల్లా ఖాన్, డాక్టర్ ఎస్.ఏ.మాజిద్, డాక్టర్ మౌలానా మహ్మద్ మహమూద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరిగింది.

రేపు నారాయణ్ సేవా కేంద్రం ప్రారంభం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు, పేదల పునరావాసం కోసం పనిచేస్తున్న ప్రముఖ సేవా సంస్థ నారాయణ్ సేవా సంస్థాన్ అధునాతన వసతులతో పునర్‌నిర్మించిన భవనం ప్రారంభోత్సవం జనవరి 29న ప్రారంభిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు అల్కా చౌదరి, మణీందర్ సింగ్, రిథిష్ జాగీర్దార్ తెలిపారు. శుక్రవారం ఇసామియాబజార్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏర్పాటుచేసిన నారాయణ్ సేవా సంస్థ కేంద్రంలో ఫిజియోథెరపి సెంటర్, ఆర్టిఫిషియల్ లింబ్ వర్క్‌షాప్, మొబైల్ రిపేరింగ్ ట్రెనింగ్ సెంటర్, కంప్యూటర్ ట్రెనింగ్, కుట్టు శిక్షణ అందిస్తామని తెలిపారు. దివ్యాంగ రోగులకు ఉచిత రోగనిర్ధారణ, తద్వారా ఉదయ్‌పూర్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు, కృత్రిమ అవయవాల పంపిణీ చేస్తున్నామన్నారు. అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో నారాయణ్ సేవా కేంద్రంలో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఘనంగా సత్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



డాక్టర్ మమత రఘువీర్ ఆచంట

గోల్కొండ: బాలికలు హైస్కూల్ స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని తరుణి ఫౌండర్ డాక్టర్ మమత రఘువీర్ ఆచంట అన్నారు. టోలిచౌకి ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్‌లో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఎంతో శక్తివంతులన్న విషయాన్ని బాలికలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రల్ ఫౌండేషన్ డైరెక్టర్ తలత్‌నిగార్, గౌరవ చైర్మన్ డాక్టర్ ఖాలిద్ ముబషీర్, ప్రిన్సిపాల్ హాజేరా, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం

నాంపల్లి: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 29న ఆదివారం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో బ్రాహ్మణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం వేడుక జరుగుతుందని ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి అచ్యుతరా శర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివాహ సమాచారం, స్పెషాలిటీ వైద్యుల సమన్వయం, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య శిబిరాలు, పేద బ్రాహ్మణుల కోసం రాయితీతో పాటు అత్యున్నత వైద్య సలహాలు, సూచనలు వంటి అనేక అంశాలపై వేదికపై వైద్యుల ప్రసంగాలు ఉంటాయని తెలియజేశారు. అంతేకాక రాబోయే రోజుల్లో భారీ ఎత్తున వైద్య శిబిరాన్ని బ్రాహ్మణుల కోసం ఏ విధంగా నిర్వహించాలనే ఆలోచనపై చర్చ జరుగుతుందని తెలిపారు. అనేక మంది ప్రముఖ వైద్యులు హాజరవుతున్న ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ, గౌరవ అతిథిగా ఎమ్మెల్సీ సురభీ వాణీదేవి హాజరవుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజు, డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం, డాక్టర్ దివ్య మాలిని, డాక్టర్ రాంగోపాల్, బిర్లా మందిరం ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు ఏబీ6 అధినేత విష్ణుదాస్ శ్రీకాంత్‌తో పాటుగా మరో వంద మందికి బ్రాహ్మణ వైద్యులకు సన్మాన సత్కారాలు ఉంటాయని అచ్యుతరామ శర్మ తెలిపారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సుందర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు నాణ్యతమైన విద్యనందించడమే తమ లక్ష్యమని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో కొమెరా ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు ఇతర రంగాలలోనూ రాణించే విధంగా తగు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పేట్లబురుజు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. కులీ కుతుబ్‌షా, ఘాన్సీబజార్, చౌక్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. షాగంజ్, లాడ్‌బజార్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జహనుమా, ముస్తాఫానగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. సుల్తాన్‌షాహీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. షాజహాన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. డార్జిలింగ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. హసన్‌నగర్, బీఎన్‌కే కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మహాలక్ష్మీనగర్, రహీంపురా విద్యుత్ ఫీడర్ల పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ మహాలక్ష్మీనగర్, రహీంపురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. శివ్‌లాల్ నగర్, గాంధీ పీటీ, కుమ్మర్‌వాడి, మార్వాడి బస్తీ, రహీంపురా గ్రౌండ్, జెండా పీటీ, ఖగజీగూడ అవుట్ పోస్ట్, సీబీబీ క్వార్టర్స్, కవేశీ మజీద్, సంజయ్ నగర్, పురానాపూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ ఆర్‌కే పేట్, దూల్‌పేట్ అండర్ గ్రౌండ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మంగల్‌హాట్ పోలీస్‌స్టేషన్, గంగాబౌలీ, ఫూసల్ బస్తీ, అజారి హోటల్, దూద్‌ఖానా, అల్లాహ్‌బండ, బిలాల్ మజీద్ ఇతర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గవర్నర్‌ను కలిసిన టీటీడీ సభ్యులు



అబిడ్స్: గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను టీటీడీ లోకల్ బాడీ సభ్యులు మెట్టు విజయ్‌కుమార్, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ యువజన నాయకులు డాక్టర్ మెట్టు శ్రీకాంత్, జాతీయ ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు ప్రసాద్ కలిశారు. ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు.

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట శుక్రవారం పర్యాటక శోభను సంతరించుకుంది. సెలవు రోజు కానప్పటికీ భారీ ఎత్తున పర్యాటకులు కోటకు తరలివచ్చారు. వచ్చిన పర్యాటకులలో ఇతర రాష్ట్రాల పర్యాటకులే ఎక్కువగా ఉన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



అఫ్జల్‌గంజ్: యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని టీఎన్జీఓల సంఘం ఉస్మానియా దంత కళాశాల శాఖ అధ్యక్షుడు హరీష్ అన్నారు. ఉస్మానియా దంత వైద్య కళాశాలలో క్యాంటీన్ ధరంసింగ్‌కు రావడంతో టీఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి



అబిడ్స్: విద్యార్థులకు అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నామని గౌతమ్‌మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షమీలా రెడ్డి పేర్కొన్నారు. దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థులు జాతీయత భావాన్ని చాటే విధంగా పలు వేషధారణ పోటీలు నిర్వహించారు. ఉత్తమ వేషధారణగా సాయిమనీష్‌ను ఆమె అభినందించి ప్రశంసించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు దేశభక్తి చాటే విధంగా తరచూ వేషధారణ పోటీలు చేపడుతున్నామన్నారు. జాతీయత భావాన్ని పెంపొందించే విధంగా విద్యార్థులందరికీ అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు షమీలారెడ్డి వెల్లడించారు.

ఉత్సాహంగా 'పరీక్షా పే చర్చ'



గోల్కొండ: విద్యార్థులకు సరైన దిశానిర్దేశనం చేసేందుకే పాఠశాలల సిలబస్‌ను భారత ప్రభుత్వం మార్పులు చేసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని గౌతమి పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షకు ముందు బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడి వారిలో ప్రోత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్, నాయకులు శ్రీకాంత్‌సాగర్, నామ యాదగిరి నేత, బోడి అన్ను యాదవ్, ప్రభు పూజారి, పవన్ సింగ్ లోద్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో గెలుపొందిన చిన్నారులతో ప్రిన్సిపాల్ బెన్ని

జియాగూడ: పురానాపూల్ కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్‌లో చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో అన్ని మతాలకు చెందిన డ్రెస్సులను ధరించి విద్యార్థులు ఆకట్టుకున్నారు. గెలుపొందినవారికి శుక్రవారం బహుమతులను ప్రదానం చేయడం జరిగింది.

సినీ నటి జమునకు ఘన నివాళి



జమునను సత్కరిస్తున్న మధుసూదనాచారి, చిత్రంలో ఆకృతి సుధాకర్ (ఫైల్)



జమునకు అవార్డు ప్రదానం చేస్తున్న రాజ్ నారాయణ్ ముదిరాజ్ (ఫైల్)

నాంపల్లి: అలనాటి సినీనటి జమున మృతికి ఆకృతి సంస్థ వ్యవస్థాపకుడు సుధాకర్ శుక్రవారం నివాళులర్పించారు. గుండమ్మ కథ 60 వసంతాల సందర్భంగా ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో మధుసూదనాచారి చేతుల మీదుగా సత్కారం చేసినట్లు గుర్తుచేశారు. మా స్వగ్రామం నాగర్ కర్నూలు జిల్లా శ్రీపురంలో 2017లో ఘన సన్మానం చేసినట్లు తెలియజేశారు. ఆమె మృతి సినిమా లోకానికి తీరని లోటని, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

టీఐఎఫ్ సంతాపం..

అఫ్జల్‌గంజ్: సినీనటిగా రాణించిన జమున రాజకీయాల్లోనూ ప్రత్యేక స్థానం సంపాదించారని తెలంగాణ మేధావుల ఫోరమ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం అఫ్జల్ గంజ్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అప్పటి సిటిజన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ సంస్థ ద్వారా జమున సేవలు గుర్తించి ఆమెకు మహిళా శిరోమణి అవార్డును అందజేసి సన్మానించామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జమున మృతి పట్ల తెలంగాణ మేధావుల ఫోరమ్ సంతాపం వ్యక్తం చేశారు.

జీఎన్ఐటీఎస్‌లో ఫైనాన్షియల్ లిటరసీ



హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులతో రవి ప్రకాశ్‌రెడ్డి

గోల్కొండ: హెచ్‌డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో షేక్‌పేట్ నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిక్కీ వైఎఫ్ఓ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ రిటైల్ బ్యాంకింగ్ అనన్య సిమ్లై ఫిక్కీ చైర్ పర్సన్ సోనాలి మోదీ తరహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ చైర్ పర్సన్ సోనాలి మోదీ తరాహ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. బ్యాంకింగ్ రంగంలో దిగ్గజమైన హెచ్‌డీఎఫ్‌సీ కళాశాల విద్యార్థినీలకు ఫైనాన్షియల్ లిటరసీపై చక్కని అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చారన్నారు. హై రిస్క్, లో రిస్క్, డిజిటల్ బ్యాంకింగ్‌తో పాటు డిజిటల్ బ్యాంకింగ్ ప్రొడక్ట్స్‌లపై కూడా ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడాలనుకునే మహిళలపై ఫైనాన్షియల్ లిటరసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ లర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ హెడ్ మాధవి గోపాజీ విద్యార్థినుల ప్రశ్నలకు చక్కని సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇనిషియేటివ్ హెడ్ స్మితాగూడ, జీఎన్ఐటీఎస్ ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ రవిప్రకాశ్‌రెడ్డి తదితరులున్నారు.

అన్ని ఖాళీలు భర్తీ చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకుల్లో అన్ని క్యాడర్ల ఖాళీలు భర్తీ చేసి పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం మహా బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్ టేక్డిలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన ధర్నాలో భాగంగా ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ కన్వీనర్ రేవంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పదోన్నతులు, మరణాల కారణంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాము సమ్మెకు దిగాల్సి వచ్చిందని, వినియోగదారులు అర్థం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ కాంతారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



బహుమతి అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సుభాన్‌పురాలో బస్తీ యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే క్రీడాకారులకు అన్నివిధాలుగా సహకారం అందుతున్నాయన్నారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్రికెట్ విన్నర్ టీమ్‌కు రూ.8 వేల నగదు, రన్నప్ టీమ్‌కు రూ.4 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు మహ్మద్ అహ్మద్, సయ్యద్ అబ్దుల్ అజీజ్, మహమ్మద్ సలీం, షేక్ జహంగీర్ పాల్గొన్నారు.

'ఆసిఫ్ జా సమీన్' సంతాప సభ



సంతాప సభ దృశ్యం

సుల్తాన్‌బజార్: ఎనిమిదవ నిజాం మనుమడు ఆసిఫ్ జా సమీన్ నవాబ్ మీర్ బర్కత్ అలీ ఖాన్ సంతాప సభ శుక్రవారం కోఠిలోని ఉమెన్స్ కళాశాలలోని బ్రిటిష్ రెసిడెన్సి (దర్బార్‌హల్)లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రిన్స్ వాలి షాన్ నవాబ్ మీర్ కరామత్ అలీఖాన్ ముఫా ఖాంజా బహదూర్ హాజరై నవాబుకు రెండు నిమిషాల పాటు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విద్యులత అధ్యక్షత వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజాం నవాబులు సమాజంలో సెక్యులర్ విధానాలు పాటించేవారన్నారు. హిందూ ముస్లింలు రెండు కళ్ల వంటివారని నవాబ్ చెబుతుండేవారని గుర్తుచేశారు. ఉర్దూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద నసీం సుల్తానా, ప్రొఫెసర్ మాజీద్, మహ్మద్ రియాజ్ అహ్మద్, సయ్యద్ తౌఫిక్ అహ్మద్, అబ్దుల్ మాజీద్, అబ్దుల్ కలీం పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



మహ్మద్ అహ్మద్



మథీన్ అశ్రఫ్

గౌలిపురా: ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టాకు చెందిన తబుస్సుం బేగం, మహ్మద్ అహ్మద్ (47) దంపతులు. 20 రోజుల క్రితం మహ్మద్ అహ్మద్ బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి..

ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–1 ప్రాంతానికి చెందిన కరీమున్నీసా, మథీన్ అశ్రఫ్ ఆలియాస్ కాజం (52) దంపతులు. మథీన్ అశ్రఫ్ కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఇందులో గత నెల 11న మథీన్ అశ్రఫ్ ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదని కరీమున్నీసా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.